క్లుప్తంగా

పేద విద్యార్థినికి చేయూత

సంతనూతలపాడు: సంతనూతలపాడు గ్రామానికి చెందిన జమల్లమూడి మాధురి అనే పేద విద్యార్థినికి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫీజు నిమిత్తం సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. ఒంగోలులోని చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మాధురికి ఫీజు నిమిత్తం ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి కళాశాల వారికి రూ.12 వేల నగదును శనివారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ మద్ది మల్లికార్జునరావు, ఒంగోలు చైతన్య కళాశాల డీన్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధుల ప్రణాళిక సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

సంతనూతలపాడు: సమగ్ర రుణ, జీవనోపాధుల సర్వేను ఎన్యూమరేటర్లు, వీవోఏలు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని మండల వెలుగు ఏపీఎం టి.బాబూరావు కోరారు. శనివారం మూడోరోజు సంతనూతలపాడులోని వెలుగు కార్యాలయంలో సమగ్ర రుణ, జీవనోపాధుల ప్రణాళిక తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎం అధ్యక్షత వహించి ప్రసంగించారు. డ్వాక్రా గ్రూప్ సభ్యుల ఆదాయం, ఖర్చులకు సంబంధించి ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, ఎన్యూమరేటర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయ దరఖాస్తుకు గడువు పొడిగింపు

సంతనూతలపాడు: సంతనూతలపాడు, గణపవరం, అమ్మనబ్రోలు గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో 5 నుంచి 8 తరగతులకు, ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని వచ్చే నెల 6వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్, సంతనూతలపాడు గురుకుల విద్యాలయ ప్రధానాచార్యులు డి.నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8 తరగతుల్లో కూడా మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. తొలుత ఈ నెల 31వ తేదీ వరకు గడువు విధించగా, తాజాగా ఏప్రిల్ 6వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వివరించారు. అన్ని తరగతులకు ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 25వ తేదీ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉగాది వేడుకలకు ఆలయాల సిద్ధం

- నేడు విశ్వావసు ఉగాది
- కిటకిటలాడనున్న ఆలయాలు
- పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు

ఒంగోలు మెట్రో: తెలుగువారి మొదటి పండుగ.. తెలుగు సంవత్సరం ప్రారంభం అయ్యే ఉగాది పండుగకు నగరంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఈఏడాది 2025–26 విశ్వావసు నామ సంవత్సరంగా పండుగ జరుపుకోనున్నారు. ఆదివారం నగరంలో ఉన్న దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పంచాంగకర్తలు, వేద పురోహితుల చేత పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఒంగోలులోని రామ్‌నగర్ మొదటి లైన్‌లో రైస్ మిల్ అసోసియేషన్ హాల్లో ఉదయం పది గంటలకు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో వేద పురోహితుడు మఠంపల్లి దక్షిణామూర్తిచే ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఉగాది వేడుకలు, కవిత గానం ఏర్పాటు చేయనున్నారు. ఉగాది పండగ పురస్కరించుకొని వివిధ సంస్థల ఆధ్వర్యంలో కవులు, రచయితలు వివిధ రంగాల్లోని ప్రతిభావంతులకు పురస్కారాలతో సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని ప్రముఖ పంచాంగ కర్తల చేత ఉగాది నూతన పంచాంగాలు ఆవిష్కరించారు.



ప్రతిభావంతులను సత్కరించిన శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సేవా సమితి సభ్యులు



విశ్వావసు నూతన పంచాంగ ఆవిష్కరణలో పంచాంగ కర్తలు

సందడిగా మారిన మార్కెట్..

ఉగాది సందర్భంగా నగర ప్రజలు మార్కెట్ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. మామిడాకులు, వేపపువ్వు, మామిడి కాయలు, పండ్లు, కూరగాయలు, వివిధ రకాల పూలు కొనుగోలు చేశారు. ఈనందర్భంగా కొత్త మార్కెట్ వినియోగదారులతో కిటకిటలాడింది.



వేపపువ్వు కొనుగోలు చేస్తున్న మహిళలు



బంతి, చామంతి పూలు కొనుగోలు చేస్తున్న నగర ప్రజలు



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్



సమావేశంలో మాట్లాడుతున్న నియోజవర్గ ఇన్‌చార్జి రవిబాబు

నిజాయితీ, నిబద్ధతతో ఉన్న వారికి గుర్తింపు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రవిబాబు
- పార్టీ అనుబంధ సంఘాల ఎంపికపై సమీక్ష

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఒంగోలు నగర పార్టీ నూతన కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల సభ్యులు ఎంపికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎప్పుడు ఏ సమస్య తలెత్తినా తమకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయి నుంచే కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం పార్టీ రాష్ట్ర వలంటీర్ విభాగం కార్యదర్శిగా నియమితులైన గోనెల మేరీకుమారి, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీగా నియమితులైన ఉన్నం జనార్దన్‌లు రవిబాబును మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చుండూరు రవిబాబును శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

ఒంగోలు సిటీ: విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తే వారికి చైతన్యం కల్పించినవారమవుతామని అదనపు సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పోక్సో చట్టం–2012 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ పిల్లల రక్షణ వారి హక్కులు, చట్టప్రకారం లభించే రక్షణలను తెలియజేయడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. చట్టం అశ్లీలత, లైంగిక వేధింపులపై పోరాడే దృఢ సంకల్పాన్ని కల్పిస్తుందని అడ్వకేట్ లక్ష్మీ నారాయణ తెలిపారు. ఎస్సైని అనిత మహిళల హక్కులు, పిల్లల ప్రత్యేక చట్టం ఎలా సహాయపడుతుందో వివరించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కళ్యాణి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పి. ఇందిర, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణ

గ్రూపు సభ్యుల సర్వే పూర్తిచేయాలి

కొత్తపట్నం: స్వయం సహాయ గ్రూపు సభ్యుల సర్వే పూర్తిచేయాలని డ్వామా పీడీ నారాయణ అన్నారు. మండల కేంద్రంలో వెలుగు కార్యాలయంలో వీవోఏ, యానిమేటర్లతో సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సభ్యుల సర్వేను వేగవంతం చేయాలని, ప్రతి సభ్యురాలు జీవన ఉపాధి ప్రణాళిక సభ్యులకు కావాల్సిన వివరాలను తెలుసుకోవాలని తెలిపారు. ప్రతి గ్రూప్‌కు ఇస్తున్న రుణాలను సకాలంలో రికవరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం విజయకుమారి, మండల సమైక్య అధ్యక్షురాలు ఏసమ్మ, సీసీలు రామారావు, సి.సుధాకర్, వీవోఏలు, ఎనిమినేటర్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ నారాయణ

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై కేసు నమోదు చేయాలి

చీమకుర్తి రూరల్: విజయవాడ నుంచి బెంగళూరుకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి మండల పరిధిలోని పల్లామల్లిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి తరలించడంపై గతంలో గ్రామస్తులు అడ్డుకున్న విషయం తెలిసిందే. దీనిపై ఈ నెల 17వ తేదీ రెవెన్యూ అధికారులు పల్లామల్లి గ్రామ సర్వే నంబర్ 33/2లో 4 హెక్టార్లు కొలిచి హద్దులు వేశారు. రెవెన్యూ అధికారులు కన్‌స్ట్రక్షన్ సంస్థ వారికి నిర్ణయించిన హద్దుల లోపల మాత్రమే తవ్వకాలు జరపాలని సూచించారు. హద్దులు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారన్నారు. కానీ, ప్రస్తుతం మళ్లీ కన్‌స్ట్రక్షన్ సంస్థ అపరిమితంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతుందని, ఆ సంస్థపై కేసు నమోదు చేయాలని గ్రామస్తులు బెల్లంకొండ శ్రీనివాస్ తదితరులు శనివారం తహసీల్దార్ బ్రహ్మయ్యకి వినతిపత్రం ఇచ్చారు.



తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న పల్లామల్లి గ్రామస్తులు

ఖోఖో పోటీల్లో రుద్రవరం హైస్కూల్ పీడీ ప్రతిభ

సంతనూతలపాడు: ఢిల్లీలో భారత ప్రభుత్వం ఉద్యోగులకు నిర్వహించిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల జట్టు పాల్గొని కాంస్య పతకం సాధించింది. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో ఏపీ జట్టు కాంస్య పతకం సాధించడంలో జిల్లాలోని సంతనూతలపాడు మండలం రుద్రవరం హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు కరిచేటి హనుమంతరావు కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా శనివారం హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో హనుమంతరావును హెచ్ఎం కె.శ్రీనివాసరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకుడు వై.శీనయ్య, తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు.



అభినందనలు అందుకుంటున్న హనుమంతరావు

అభివృద్ధి పనులకు ఆమోదం



అజెండా వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి

చీమకుర్తి: మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు పాలకవర్గ సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) నిధులు రూ.2.20 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసేందుకు ఎన్‌ఓసీ కాపీని కలెక్టర్ కార్యాలయానికి ఇచ్చేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఏసీయన్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.73 కోట్లతో చీమకుర్తి పట్టణ ప్రజలకు రామతీర్థం రిజర్వాయర్ నుంచి సురక్షితమైన తాగునీటిని అందించేందుకు డీపీఆర్ తయారు చేసేందుకు ఆమోదం తెలిపింది. అసంపూర్తంగా ఉన్న అర్బన్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి రూ.27 లక్షలు కేటాయించారు. 15వ ఫైనాన్స్ నిధులు రూ.48 లక్షలతో పలు అభివృద్ధి పనులకు పరిపాలనా మంజూరు ఉత్తర్వులిచ్చారు. శ్మశాన వాటిక సమీపంలో రూ.10 లక్షలతో సైడు కాలువ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. కమిషనర్ వై.రామకృష్ణయ్యతో పాటు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా పులివర్తి



నూతనంగా ఎన్నికైన విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా పులివర్తి సాయిబాబా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నగరంలోని గాంధీరోడ్డులోని పీఎస్ బాబు నివాసం వద్ద విశ్వబ్రాహ్మణ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బండికట్ల వీరబ్రహ్మాచార్యులు అధ్యక్షత వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా సుతారం శ్రీనివాసులను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పులివర్తి సాయిబాబా మాట్లాడుతూ సంఘానికి నా వంతు కృషి చేస్తానన్నారు. అలానే అందరిని కలుపుకొని సంఘం అభివృద్ధికి తోడ్పడతానని హామీఇచ్చారు. కార్యక్రమంలో మైకేబుల్ ఎండీ కొండూరు విశ్వసేన్, స్వర్ణకార సంఘ నాయకులు, ఆదిమూలం సుబ్బారావు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రావూరి లక్ష్మయ్య, చోడా శ్రీనివాస్, మంచాబాబు, బ్రహ్మం, బాలసుబ్రమణ్యం, నల శ్రీనివాసాచారి, వేల్పూరి రామారావు, అజయ్ కుమార్, శోభిరాల సుబ్బారావు, బ్రహ్మయ్య, గోనుగుంట బ్రహ్మేంద్ర కుమార్, హరనాథ్ డోలానంద ప్రసాద్, మల్లేశ్వరరావు, రంగస్వామి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

పార్టీ గెలుపుకోసం ఐక్యంగా పోరాడుతాం

- ఉత్సాహంగా గ్రామ కమిటీలు

కొత్తపట్నం: మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేవిధంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి పోరాడాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పార్టీ గ్రామ అధ్యక్ష, కమిటీల ఎంపిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో కమిటీలు ఎంపికలు సజావుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈఎంపికల్లో కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు ఉత్సాహం పాల్గొంటున్నారని చెప్పారు. అనంతరం గ్రామ అధ్యక్షులు, యూత్ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటికే గుండమాల, మోటుమాల, పాదర్తి, కొత్తపట్నం, కె.పల్లెపాలెం, రంగాయపాలెం గ్రామాల్లో నూతన కమిటీ ఎన్నిక పూర్తి చేశారు. మిగిలిన గ్రామ పంచాయతీలు ఈనెల నేడు, రేపు, ఏప్రిల్ 1 పూర్తి చేసి జాబితాను జిల్లా పార్టీ నాయకులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, మాజీ అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు భర్త సైకం లక్ష్మీశారద, రంగాయపాలెం గాలి మునలారెడ్డి, ద్వారం మురళీ, తంబి కాంతారావు, మరపాల సుధాకర్‌రెడ్డి, కోడూరి శ్రీను, తంబి వెంకటేశ్వర్లు, తంబి సురేష్, దోనె రామ్మోన్, తంబి వెంకటేష్, రమాదేవి, మల్లేశ్వరి, కుమారి పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మండల కన్వీనర్ అంజిరెడ్డి

ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు

- మాజీ మంత్రి మేరుగు నాగార్జున

సంతనూతలపాడు: సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున శుభాకాంక్షలు తెలిపారు. ఈ తెలుగు నూతన సంవత్సరమంతా ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఆనందంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు.




ఉగాది శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు టౌన్: ఉగాది పచ్చడిలోని షడ్రుచుల తరహాలోనే జీవితంలోనూ కష్ట సుఖాలు, మంచి చెడులు ఉంటాయని, వాటన్నిటిని సంయమనంతో స్వీకరించి సంతోషంగా గడపాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆకాంక్షించారు. ఈ మేరకు శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉగాది అనగానే తీపి, వగరు, పులుపు, ఉప్పు, కారం, చేదు రుచులతో కూడుకున్న పచ్చడి గుర్తుకు వస్తుందని, సంప్రదాయబద్ధంగా ప్రతి ఒక్కరూ ఉగాదిని నిర్వహించుకోవాలని కోరుకున్నారు. విశ్వావసు నామ సంవత్సరం ప్రతి ఒక్కరికి శుభాలు కలగాలని, సిరిసంపదలతో ప్రశాంత జీవనం గడపాలని కోరారు.

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. చెడు వ్యసనాలకు బానిసలై చెడుమార్గంలో పయనించే వారి జీవితాలు నాశనం అవుతాయన్నారు. రాజ్యాంగం ప్రకారం మనకు ఉన్న హక్కులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక వసతులపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.హేమలత, గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్, జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, న్యాయవాది పిచ్చయ్య, కోర్టు సిబ్బంది మధుసూదనరావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్లాం పేటలో మురుగు నీరు సరఫరా



నల్లగా, మడ్డిగా ఉన్న నీరు

ఒంగోలు టౌన్: నగర పాలక సంస్థ కలుషిత నీటిని సరఫరా చేయడంతో ఇస్లాం పేట ప్రజలు మండిపడుతున్నారు. వాస్తవానికి మూడు రోజులకోసారి నగర పాలక సంస్థ నీటిని విడుదల చేస్తుంది. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండుగలు రావడంతో ప్రజలు మంచినీటి కోసం ఎదురుచూస్తున్నారు. అయితే శనివారం సాయంత్రం సరఫరా చేసిన నీరు దుర్వాసన వచ్చాయి. నల్లగా, మడ్డిగా మురుగు కాల్వలలోని వాసన వేస్తుండటంతో ప్రజలు బిత్తర పోయారు. మంచినీటి కోసం ఎదురు చూస్తే మురుగు నీరు విడుదల చేశారని ప్రజలు మండిపడుతున్నారు. అసలే వేసవి కాలం, మంచినీరు కలుషితం అయితే వీరేచనాలు, కామెర్లు లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. అయినప్పటికీ నగర పాలక సంస్థ అధికారులకు ఇవేమీ పట్టలేదు. నిర్లక్ష్యంగా నీటిని విడుదల చేశారు. ఈ నీరు తాగడానికి పనికి రావు, కనీసం వాడుకోడానికి కూడా ఉపయోగపడవని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీటిని విడుదల చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడిన సిబ్బంది మీద చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు



చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

ఒంగోలు వన్‌టౌన్: రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు ముస్లిం, మైనార్టీ వెల్ఫేర్ ఎకనమికల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం తోఫా అందించారు. నగరంలోని గుంటూరు రోడ్డులోని సొసైటీ కార్యాలయంలో ఖాదర్ బాషా మాట్లాడుతూ పేదలు రంజాన్ మాసంలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో తోఫా పంపిణీ చేశామన్నారు. దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ ఎస్‌కె మహబూబ్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉన్న పేదలు పండుగ ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కె కాలేషా, ఎంఎ సాలార్, ఎస్‌కె జానీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ..

రంజాన్ సంధర్భంగా పేద ముస్లిం మహిళలకు హజిన్ ఫాతిమా అజీమా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు మహబూబ్ జాన్ మాట్లాడుతూ పేద ముస్లింలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలనేదే తమ సంకల్పం అన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ సమైఖ్యతకు రంజాన్ ప్రతీకలాంటిదన్నారు. కార్యక్రమంలో అజీజ్ తదితరులు పాల్గొన్నారు.









